

ఆంధ్రజ్యోతి

కర్నూలు
జిల్లా వార్తలు
3
సోమవారం 12 ఆగస్టు 2024


సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువ గేట్ల లీకేజీ (ఫైల్)

మన ప్రాజెక్టులు భద్రమేనా...?


అవుకు రిజర్వాయర్ గేట్లు

- నిర్వహణ నిధులు కూడా ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- శ్రీశైలం గేట్లు రబ్బర్ సీల్స్ మార్చకపోవడంతో లీకేజీలు
- వెలుగోడు జలాశయం మరమ్మతులు ఎప్పుడో?
- అవుకు జలాశయం గేట్ల నుంచి లీకేజీలు
- సుంకేసులు బ్యారేజీ ఆధునికీకరణ ప్రతిపానదలకే పరిమితం
- తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిన ఘటన
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల భద్రతపై ఎన్నో అనుమానాలు


కర్నూలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

పులిచింతల ప్రాజెక్టు 16వ గేటు 2021 ఆగస్టులో కొట్టుకుపోయింది.. అదే ఏడాది నవంబరులో కడప జిల్లా అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఏకంగా ప్రాజెక్టే కొట్టుకుపోయింది. గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ఘటనలు మరవక ముందే శనివారం రాత్రి తుంగభద్ర డ్యాం గేట్లు దింపుతుండగా 19వ గేటు చైన్ లింక్ తెగిపోయి గేటు కొట్టుకుపోయింది. దీంతో కర్ణాటక సహా తెలుగు రాష్ట్రాల ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ప్రభుత్వాలు డ్యాం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే డ్యాం గేటు కొట్టుకుపోయిందని సాగునీటి నిపుణులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాయలసీమ పల్లెసీమలకు సాగు, తాగునీరు అందించే శ్రీశైలం, వెలుగోడు, అవుకు, సుంకేశుల వంటి ప్రాజెక్టులు భద్రమేనా..? వీటి నిర్వహణపై పాలకుల చిత్తశుద్ధితో పని చేస్తున్నారా..? వంటి ప్రశ్నలు తలెత్తున్నాయి.

రాయలసీమ అంటేనే గుర్తొచ్చేది తీవ్ర కరువు.. దుర్భిక్షం. ఏటేటా సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతోంది. ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగుతున్న తుంగభద్ర, కృష్ణా నదుల వరదను ఒడిసిపట్టి నిల్వ చేసుకునేందుకు ఉన్నవే నాలుగైదు జలాశయాలు. తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం డ్యాం ఎగువ జలాలను కరువు సీమకు మళ్లించాలనే లక్ష్యంగా 1983-04లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేపట్టిన తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా వెలుగోడు, అవుకు, గాలేరు-నగరి ప్రాజెక్టులో భాగంగా గోరుకల్లు, హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా కృష్ణగిరి, పత్తికొండ జలాశయాలు నిర్మించారు. ఆయా జలాశయాలకు కృష్ణా జలాలు మళ్లించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్, కేసీ కెనాల్‌కు నీటిని మళ్లించేందుకు తుంగభద్రపై సుంకేసుల బ్యారేజీ, హంద్రీ నదిపై గాజులదిన్నె జలాశయం నిర్మించారు. ఆయా ప్రాజెక్టులకు నిర్వహణ నిధులు ఇవ్వక.. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం సాగునీటి ప్రాజెక్టులకు శాపంగా మారిందనే ఆరోపణలు లేకపోలేదు.

మరమ్మతులకు నోచుకోని శ్రీశైలం

శ్రీశైలం ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల కోసం 'డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం' (డ్రిప్)-2 కింద రూ.139 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కొర్రీలు పెట్టి ప్రపంచ బ్యాంక్ వెనక్కి పంపితే.. లోపాలను సవరించి రూ.190 కోట్లతో మరో ప్రతిపాదన పంపించారు. తాజాగా ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు డాక్టరు హ్యానిశ్‌శాలం, అభిషేక్‌కుమార్ సూచనల మేరకు డ్యాం భద్రతకు చేపట్టాల్సిన 19 పనులకు రూ.203 కోట్లతో మరో ప్రతిపాదన పంపినట్లు ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కర్నూలు సీఈ కబీర్‌బాషా వివరించారు. స్పిల్‌వే గేట్ల దిగువన ప్లంజ్‌పూల్ గుంత పూడ్చివేత, 2009 వరదకు దెబ్బతిన్న డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో అప్రాన్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు, రిటైనింగ్ వాల్, రివర్స్ స్లూయిస్ గేట్లు మరమ్మతులు, లీకేజీలు అరికట్టేందుకు గేట్లకు సీల్స్ ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉంది. తక్షణ మరమ్మతుల కోసం ఓ అండ్ ఎం గ్రాంటు కింద రూ.64 లక్షలు తక్షణమే ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతిపాదనలు పంపారు. నిధులు వస్తే తప్పా మరమ్మతులు చేయలేని పరిస్థితి ఉంది. గత వైసీపీ లాగే ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం ప్రదర్శించకుండా తక్షణ మరమ్మతులకు నిధులు ఇవ్వాలి. లేదంటే తుంగభద్ర లాంటి సంఘటన జరిగితే సీమ రైతులు తీవ్ర నష్టాని చవిచూడాల్సి వస్తుంది.



శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు దిగువన ప్లంజ్‌పూల్ (ఫైల్)

అవుకు.. ఆగని లీకేజీలు

తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 4.148 టీఎంసీల సామర్థ్యంతో అవుకు జలాశయం నిర్మించారు. 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది.. కడప జిల్లాకు కృష్ణా జలాలు ఈ జలాశయం నుంచే మళ్లిస్తున్నారు. ఎంతో కీలకమైన అవుకు రిజర్వాయర్ ఎస్ఆర్‌బీసీ, పాలేరు, గొల్లలేరు, జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల గేట్లు దెబ్బతిన్నాయి. కొన్ని గేట్లు స్ట్రక్ అవుతున్నాయి. రోప్ (ఇనుప తాళ్లు) తెగిపోతున్నాయి. గేట్లు, రోప్‌లు కొత్తవి ఏర్పాటు చేయలని ఇంజనీర్లు అంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో గేట్లు ఏర్పాటు చేయాలంటే దాదాపుగా రూ.6 కోట్లు కావాలి. ప్రభుత్వం నిధులు ఇస్తే తప్ప గేట్ల మరమ్మతులకు నోచుకునే పరిస్థితి లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం శాపంగా మారింది. 2022లో రూ.2.01 కోట్లతో మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. పాలేరు స్లూయిస్ మరమ్మతులకు రూ.45 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. జగన్ ప్రభుత్వంలో పనులు చేస్తే బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. టీడీపీ ప్రభుత్వం అవుకు గేట్ల మరమ్మతులపై దృష్టి సారించాలి.

పీఆర్‌పీ గేట్లపై దృష్టి పెట్టాలి

రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని మళ్లించే జీవనాడి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ, గాలేరు-నగరి, కేసీ కెనాల్ ఎస్కేప్ చానల్, కుందూ ద్వారా సోమశిల జలాశయానికి కృష్ణా వరద జలాలు ఇక్కడి నుంచే మళ్లించాలి. 2004-05లో 44 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 10 గేట్లు ఏర్పాటు చేసి హెడ్ రెగ్యులేటర్ నిర్మించారు. ఎంతో కీలకమైన రెగ్యులేటర్ గేట్లు నిర్వహణలో ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం శాపంగా మారింది. అయితే.. గతేడాది కొంత వరకు రిపేరీలు చేశామని ఇంజనీర్లు అంటున్నారు. ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన పాత హెడ్ రెగ్యులేటర్ పవర్ జనరేషన్ గేట్ల నుంచి లీకేజీలు వస్తున్నాయి.


పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లు

తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలి


కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 11: తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకు పోవడంతో 90 వేల నుంచి లక్ష క్యూసెక్కుల దాకా నీరు దిగువ ప్రాంతాలకు వస్తుండటంతో మంత్రాలయం, కౌతాళం, కోసిగి, నందవరం, సి. బెళగల్ మండలాల తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆదివారం ఎస్పీ, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, జలవనరుల శాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదల విషయాన్ని ప్రజలకు చెప్పి.. నదిలోకి దిగనీకుండా, చేపలు పట్టడానికి మత్స్యకారులను వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయం దండోరా, మైకుల ద్వారా ప్రచారం చేయించాలన్నారు. నీటి ప్రవాహ పరిస్థితిపై పర్యవేక్షణ చేస్తుండాలని సూచించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ టీములను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎస్పీ బిందుమాధవ్‌ను కోరారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మధుసూదన్‌రావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి అనుపమ, జిల్లా ఫిషరీస్ అధికారి శ్యామల, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జి కమాండెంట్ పాల్గొన్నారు.

సుంకేశుల ఆధునికీకరణ మరిచారా..?

తుంగభద్ర నదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్యారేజీ సుంకేశుల జలాశయం. కేసీ కాలువ ద్వారా 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు ఈ బ్యారేజీ నుంచే అందాల్సి ఉంది. 2009 వరదలకు ప్రాజెక్టు పూర్తిగా దెబ్బతింది. నాడు టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం కింద రూ.8.50 కోట్లు మంజూరు చేస్తే రూ.6.50 కోట్లు ఖర్చు చేసి గేట్లు మరమ్మతులు చేశారు. కేసీ కాలువ గేట్లు లీకేజీలు వస్తున్నాయి. పూర్తిస్థాయి ఆధునికీకరణ కోసం 2018-19లో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు (సింప్) కింద రూ.578 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. నిధులు కూడా మంజూరు అయ్యారు. ఇంతలో టీడీపీ ప్రభుత్వం పోయి వైసీపీ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం నిధులు చెల్లించకపోవడంతో ఆ నిధులు వెనక్కివెళ్లాయి. టీడీపీ ప్రభుత్వమైనా సుంకేశుల ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలి.

వెలు'గోడు' వినేదెవరు..?



కర్నూలు జిల్లాలో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 16.95 టీఎంసీలతో వెలుగోడు జలాశయం నిర్మించారు. సీమ జిల్లాకు సాగునీరు, చెన్నై నగరానికి తాగునీరు అందించే ప్రధాన రిజర్వాయర్ ఇది. 218.40 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, ఆనకట్ట పొడవు 11.64 కి.మీటర్లు, ఆనకట్ట ఎత్తు 28 మీటర్లు, 6 మీటర్లు ఆనకట్ట పైభాగం వెడల్పుతో 1983-84లో నిర్మాణ పనులు చేపట్టి 1996లో పూర్తి చేశారు. దేశంలోనే అతిపొడవైన మట్టి ఆనకట్ట జలాశయం ఇది. లోపలి భాగంలో వెదర్ రాక్ రిబిట్మెంట్ (రాతిపరుపు) ఏర్పాటు చేశారు. 23 ఏళ్లు కావడంతో నీటి అలల ఒత్తిడికి రాతిపరుపు ఆనకట్ట అక్కడక్కడ కుంగిపోతోంది. గేట్లు నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉంది. ఈ జలాశయం మరమ్మతుల కోసం డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్)-2 కింద రూ.99 కోట్ల ఇవ్వాలని గతంలో ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపుచ్చుతున్నది.


సుంకేసుల జలాశయం

పైపైకి ఉల్లి ధర

కర్నూలు యార్డులో గరిష్ఠంగా రూ.2,820



కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 11: గతంలో ఇదే సీజన్‌లో ఉల్లి ధర పూర్తిగా తగ్గిపోయింది. రైతులు రవాణా ఖర్చులు గిట్టుబాటు అయ్యే ఆశ లేదంటూ కర్నూలు మార్కెట్ యార్డులోనే వ్యాపారులకు అమ్మకుండా వదిలిపోయిన సంఘటనలు జరిగాయి. అయితే.. ప్రస్తుతం ఉల్లి ఘాటెక్కింది. శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో వివిధ ప్రాంతాల నుంచి రైతులు 111 క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. క్వింటానికి గరిష్ఠ ధర అత్యధికంగా రూ.2,820, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.2,740 అమ్ముడుపోయినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్ తెలిపారు. తాము ఆశించిన ధర అందుతుందో లేదోనని ఆందోళన చెందామని, అయితే.. ఊహించని విధంగా ధర దక్కుతుండటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కందులపై గరిష్ఠ ధర రూ.10,109, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.5,179కు ధర దక్కడం రైతుల్లో సంతోషం కలిగించింది. వేరుశనగలకు గరిష్ఠ ధర రూ.7,190, మధ్యస్థ ధర రూ.5890, కనిష్ఠ ధర రూ.2,222 రైతులకు దక్కింది. కొర్రలు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధర క్వింటానికి రూ.3,629 పలికింది.

ఏడు గేట్ల నుంచి నీటి విడుదల



శ్రీశైలం, ఆగస్టు 11: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం కొనసాగడంతో డ్యామ్ అధికారులు జలాశయం 7 క్రస్టు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 78,827 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 30,117 క్యూసెక్కులు మొత్తం 1,08,971 వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 882.70 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.9673 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,630 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,540 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 1,89,133 క్యూసెక్కులు మొత్తం 2,57,303 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 11: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ఆదివారం సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లోని ఏ గ్రామంలో, ఏ తేదీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేదీ షెడ్యూల్‌ను పంపాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా చాలా వరకు భూ సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా ఆర్‌వోఆర్, 1బీ, వెబ్ ల్యాండ్, అడంగల్ వంటి రికార్డులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. 22ఏ ఫ్రీహోల్డ్ అన్ని కూడా చెకప్ చేయాల్సి ఉంటుందన్నారు. గతంలో పంపిణీ చేసిన భూహక్కు పట్టలను తీసుకుని వాటి స్థానంలో కొత్త పాసు పుస్తకాలను మంజూరు చేయాలన్నారు. సదస్సులో తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అన్ని రకాల రికార్డులు తీసుకుని వచ్చి వెరిఫై చేయడంతోపాటు ఏ సమస్యకైనా నిర్ణీత సమయంలో నోటీసు ఇచ్చి పరిష్కరించేలా తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌వర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవోలు రామలక్ష్మి, శేషిరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

చదువుతూ సాగుతున్నారు..!

- ఆర్టీసీ బస్టాండులోనే విద్యార్థుల హోంవర్క్
- సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్న వైనం

మంత్రాలయం, ఆగస్టు 11: చదువే అన్నిటికి మూలమని తెలుసుకున్నట్టున్నారు.. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని గ్రహించినట్టున్నారు.. అందుకే ఏ కొద్దిపాటి సమయం దొరికినా సద్వినియోగం చేసుకుంటున్నారు. బస్టాండ్‌లో సైతం రాసుకోవడమో.. చదువుకోవడమో చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. సూగూరు గ్రామానికి చెందిన దాదాపు 50 మందిపైగా విద్యార్థులు మంత్రాలయం మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రతి రోజూ ఆర్టీసీ బస్సు ద్వారా వీరంతా రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు చదువుకుంటున్న వారు ఉన్నారు. పాఠశాల వదిలిన తరువాత ఇంటికి వెళ్లడంలో భాగంగా నాలుగు గంటలకు బస్టాండ్‌కు చేరుకుంటారు. వీరు వెళ్లే బస్సు సర్వీసు ఐదున్నర గంటలకు ఉండడంతో దాదాపు గంటన్నర సేపు వేచి చూడాల్సిన పరిస్థితి. అయితే విద్యార్థులు ఈ సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటున్నారు. తరగతి గదిలో మాదిరిగానే బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్‌పై కూర్చొని హోంవర్క్ చేసుకుంటున్నారు. బస్సు రాగానే క్రమ పద్ధతిలో బస్సు ఎక్కి గ్రామానికి చేరుకుంటున్నారు. వీరంతా వరుస పద్ధతిలో క్రమశిక్షణతో కూర్చుని చదువుకోవడం, రాసుకోవడం చూసి ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మంత్రాలయం ఆర్టీసీ బస్టాండులో హోంవర్క్ చేసుకుంటున్న విద్యార్థులు



ఎన్నికల్లో అధికారి అవినీతి

- ఎలక్షన్ ఫండ్‌లో చేతివాటం
- నియోజకవర్గాలకు కేటాయించిన మొత్తంలో కమీషన్లు
- బిల్లుల్లో అవకతవకలు
- ప్రింటర్ల వద్ద నుంచీ భారీగా వసూళ్లు
- ఎన్నికల సామగ్రి మాయం
- చక్రం తిప్పిన మహిళా అధికారి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఓ అధికారికి కాసుల వర్షం కురిపించింది. ఎన్నికల నిర్వహణ కోసం సంబంధిత శాఖ కేటాయించిన నిధుల్లో సదరు అధికారి చేతివాటం ప్రదర్శించి బాగానే వెనకేసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో కమీషన్లు దండుకోవటమే కాకుండా, పనులు చేసిన తర్వాత పెట్టే బిల్లుల్లోనూ మతలబు చేసినట్లు తెలుస్తోంది. ఓటరు జాబితాకు సంబంధించి ప్రింటర్ల దగ్గర నుంచి భారీగా కమీషన్లు దండుకోవటమే కాకుండా, ఎన్నికలకు ఉపయోగించిన సామగ్రిని సైతం అమ్ముకున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో సంబంధిత సెక్షన్‌లోని ఓ మహిళా అధికారి చక్రం తిప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా మొత్తమ్మీద ఎన్నికల సమయంలో లక్షల రూపాయలు ఈ అధికారి కూడబెట్టినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఆరా తీస్తే అసలు నిజాలు బయటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నంద్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా యంత్రాంగం కొంత మంది డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులకు జిల్లా కేంద్రంలో ఎన్నికల సెల్ విధులు కేటాయించింది. ఇందులో ఓ మహిళా డిప్యూటీ తహసీల్దారు స్థాయి అధికారి కూడా ఉన్నారు. ఇక ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారి సదరు మహిళా అధికారికి ఎన్నికల ఫండ్, ఈవీఎం గోడౌన్ల బాధ్యతను అప్పగించారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం జిల్లాకు దాదాపు రూ.15 కోట్లు కేటాయించగా, జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి దాదాపు రూ.1.30 కోట్ల మేర నిధులు అందినట్లు ఈ అధికారికి తెలిసింది. దీంతో ఆమె కన్ను ఎన్నికల ఫండ్ మీద పడింది. మళ్లీ ఇలాంటి ఛాన్స్ వస్తుందో, రాదో అనుకొని భారీగా దండుకోవాలని ఆలోచించారు. ఎన్నికల నిర్వహణ కోసం వాడే ప్రతి రూపాయిలో కమీషన్ తీసుకున్నారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన సొమ్ము విడుదల చేసినందుకు ఒక్కో నియోజకవర్గం నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు కమీషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికీ కొన్ని నియోజకవర్గాలకు ఎన్నికల ఖర్చుల బిల్లులు పూర్తిస్థాయిలో విడుదల కాలేదు. వచ్చిన ఫండ్ సరిపోలేదని, మిగిలిన ఖర్చులకు సంబంధించిన నిధులు విడుదల చేయాలంటూ సంబంధిత అధికారులు మళ్లీ బిల్లులు పెట్టారు. ఈ బిల్లులు రూ. కోట్లలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మళ్లీ నిధులు విడుదలైన తర్వాత ఆయా నియోజకవర్గాలకు మంజూరు చేసే సమయంలో తనకు కమీషన్ అందేలా ముందుగానే సంబంధిత అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.



బిల్లుల్లో మతలబు..

ఎన్నికల నిర్వహణలోని వివిధ అవసరాలకు యంత్రాంగం డబ్బు ఖర్చులు చేస్తుంది. అయితే ఈ ఖర్చులు బిల్లుల రూపంలో పై అధికారులకు సమర్పించి సంతకాలు చేయించాలి. ఆ తర్వాతే పెట్టిన ఖర్చులకు డబ్బులు ఆయా కాంట్రాక్టర్లకు విడుదల కావు. అయితే ఈ మహిళా అధికారి ఇందులో బాగానే అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. బిల్లులను కలర్ కాపీలు రెండు మూడేసి తీయించి తన వద్ద పెట్టుకున్నారు. మొదట సంబంధిత ఖర్చును బిల్లు బుక్కులో రాసి ఆ బిల్లును అధికారులకు సమర్పించేవారు. ఆ తర్వాత బిల్లులో తేడా జరిగిందని తన వద్ద ఉన్న కలర్ కాపీ బిల్లుల్లో అంకెలు మార్చి మరోసారి ఉన్నతాధికారుల నుంచి సంతకాలు తీసుకునేవారు. ఈ బిల్లును పనులు చేసిన కాంట్రాక్టరకు ఇచ్చి, ఎక్కువ మొత్తంలో చూపిన ఖర్చు తనకు అందేలా చూసుకునేవారు. ఎవరైనా బిల్లులను తనిఖీ చేసినా.. మొదట బిల్లు వాస్తవ ఖర్చులనే చూపించవచ్చు కాబట్టి బిల్లుల్లో జరిగిన అవకతవకలు బయటపడే అవకాశం ఉండదు. ఈ విషయం సదరు అధికారికి బాగా తెలుసు కాబట్టి బిల్లుల్లో మతలబులు చేసి భారీగానే అక్రమార్జన చేసినట్లు తెలుస్తోంది.

ప్రింటర్ యజమానుల నుంచి..

ఓటర్ల నమోదు, తొలగింపు వంటివి పూర్తయిన తర్వాత ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూనుకుంటుంది. ఈ సంవత్సరం కూడా అలాగే చేసింది. జిల్లాలోని ఓటరు జాబితా ప్రింటింగ్ బాధ్యతను రెండు ప్రింటింగ్ దుకాణాలకు అప్పగించింది. ఈ రెండు దుకాణాలకు బిల్లుల మంజూరు విషయంలో కూడా సదరు అధికారి చేతివాటం బాగానే చూపించినట్లు తెలుస్తోంది. ప్రింటింగ్ దుకాణాల యజమానులను మచ్చిక చేసుకుని ఒక్కొక్కరి నుంచి దాదాపు రూ.4 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇక ఇవి చాలవన్నట్లు ప్రభుత్వం అందించిన ఇంధన కూపన్లను కూడా సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఇతర అధికారులు ఆయా నియోజకవర్గాలకు తిరుగుతుంటారు. వారి ప్రయాణ ఇంధన ఖర్చుల కోసం ఈ అధికారి డబ్బులు కాకుండా, కూపన్లు అందజేశారు. ఓ ప్రభుత్వ శాఖ జిల్లా కేంద్రంలో నిర్వహించే పెట్రోలు బంకులో ఈ కూపన్లను అందజేస్తే అధికారుల వాహనాల్లో ఇంధనం నింపుతారు. అయితే ఇవి పూర్తిగా ప్రభుత్వ పనుల మీద వెళ్లినపుడు మాత్రమే ఉపయోగించాలి. కానీ సదరు అధికారి మాత్రం తన సొంత అవసరాల నిమిత్తం ఊళ్లకు, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు ఈ కూపన్లను ఉపయోగిస్తున్నారు. ఇలా తన సొంత ఖర్చులను ప్రభుత్వం మీద రుద్దుతున్నారు. మొత్తమ్మీద ఈ ఎన్నికల పుణ్యమా అని భారీగానే ఆమె డబ్బులు కూడబెట్టుకున్నారని తోటి ఉద్యోగులే చెవులు కొరుక్కుంటున్నారు!

ఎన్నికల సామగ్రి ఏమయింది..?

ఎన్నికల వేళ, ఓట్ల లెక్కింపు వేళ స్టేషనరీ ఖర్చు భారీగా ఉంటుంది. డ్రమ్ములు, టబ్బులు, పేపర్లు.. ఇలా వివిధ వస్తువులు కొనాల్సి ఉంటుంది. వీటిలో చాలా వరకు ఆ సందర్భానికి వాడుకున్న తర్వాత మరలా వాడుకోవటానికి పనికి రావు. కానీ డ్రమ్ములు, టబ్బులు, ఇతరత్రా సామాన్లు మళ్లీ వాడుకోవచ్చు. ఎన్నికల వేళ ఇలాంటివి ఎక్కువగానే కొన్నారు. అయితే ప్రస్తుతం అవేమీ కనిపించడం లేదని తెలుస్తోంది. వీటిని సదరు అధికారి అమ్ముకుని సొమ్ములు చేసుకున్నట్లు సమాచారం. ఇదంతా పై అధికారులకు తెలియకుండానే జరుగుతోందా? లేక ఇందులో వారిరీ వాటా ఉండటంతోనే పట్టించుకోలేదా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఈ విషయం పైన ఉన్నతాధికారులు దృష్టి సారించి అసలేం జరిగింది? ఎన్నికల వేళ ఎంత మేర ప్రభుత్వ ధనం పక్కదారి పట్టింది? ఎన్నికల సామాగ్రి ఏమయింది? అని ఆరా తీస్తే అసలు లెక్కలు బయటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

16 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

- సెప్టెంబరు 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్
- జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించనున్న జాయింట్ కలెక్టర్
- పిటీషన్ల వివరాలు ఐదు రిజిస్టర్లలో నమోదు
- హాజరు కానున్న ఏడుగురి కమిటీ సభ్యులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 11: ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండలాలు, మున్సిపాలిటీల్లో మీ కోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై రైతులు ఎక్కువగా ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో కూడా భూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోని ప్రభుత్వ భూములు, రైతుల భూములు భూకబ్జాలకు, భూఆక్రమణలకు గురయ్యాయి. దీంతో కూటమి ప్రభుత్వం రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రతి గ్రామంలో జరిగే గ్రామ రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి సదస్సుల నిర్వహణకు, పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించనున్నారు. అదే విధంగా జిల్లాలోని నోడల్ అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను నియమించనున్నారు. గ్రామాల్లో జరిగే గ్రామ రెవెన్యూ సదస్సుకు ఏడుగురు కమిటీ సభ్యులు తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి, అటవీశాఖ అధికారులు పాల్గొంటారు. భూ సమస్యల ఫిర్యాదులను 45 రోజుల్లో అధికారులు పరిష్కారం చేయనున్నారు. 15న జిల్లాలోని మంత్రులు గ్రామ రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మండలాలవారీగా గ్రామాల్లో సదస్సుల నిర్వహణ తేదీలను మంగళవారంలోపు కలెక్టర్ ప్రకటించను న్నారు.

బాధితుల నుంచి పిటీషన్ల స్వీకరణ

భూ కొలతల్లో తేడా, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వం పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డులలో నమోదైన తప్పులు, భూకబ్జాలు, భూఆక్రమణలు, అసైన్డ్, చుక్కల భూములు తదితర అంశాలపై బాధితుల నుంచి పిటీషన్లు అధికారులు స్వీకరించనున్నారు. మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు, భూమి వివాదాలు, భూ ఆక్రమణ, నిషేధిత జాబితా 22(ఏ) గోల్‌మాల్ రిజిస్టర్లలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేస్తారు.

శ్రీమఠంలో అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



పీఠాధిపతితో కోనంకి కిష్టప్ప, నాగరత్నమ్మ, కుటుంబ సభ్యులు

మంత్రాలయం, ఆగస్టు 11: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బళ్లారికి చెందిన కోనంకి కిష్టప్ప, నాగరత్నమ్మ అనే దంపతులు రూ.2 లక్షల విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి రూ. 2 లక్షల నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఓబులయ్య, కిషోర్, కావ్య, సహస్ర పాల్గొన్నారు.


కిక్కిరిసిన భక్తులు



శ్రీ మఠం ప్రాంగణంలో భక్తులు రద్దీ

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మఠం సందడిగా మారింది. రెండో శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షిణాది నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు.

కొడుకు మాట వినలేదని తండ్రి ఆత్మహత్య



సిద్దరామప్ప(ఫైల్)

ఆదోని రూరల్, ఆగస్టు 11 : చెప్పిన మాట కొడుకు వినలేదని ఓ తండ్రి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల సిద్దరామప్ప(53) ఆదోనిలోని శ్రీ ఓమ్స్ కాలనీలో ఉంటున్నాడు. సిద్దరామప్పకు భార్య చిన్న లింగమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో రెండో కుమారుడికి పెళ్లి చేయాలని మూడు, నాలుగేళ్లుగా పెళ్లి చూపులు చూస్తున్నా ఒప్పుకోవడం లేదు. ఈ క్రమంలోని శనివారం రాత్రి తాను ప్రేమ పెళ్లి చేసుకుంటానని చెప్పుకుంటానని కొడుకు చెప్పడంతో సిద్దరామప్ప మనస్థాపానికి గురయ్యాడు. వైసీఆర్ టౌన్‌షిప్ సమీపంలో ఉన్న పంట పొలంలోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా కమిటీ

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 11: ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆదివారం వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం జిల్లా కార్యవర్గాన్ని సభ్యులంతా పరస్పర సహకారంతో ఏకగ్రీవంగా చేసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా కే.రవిప్రకాష్, జిల్లా కార్యదర్శిగా ఎంసీ కాశన్న, జిల్లా కోశాధికారిగా బి.నాగ కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షక అధికారిగా ఎం.వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా రమేష్, ఎలక్షన్ అబ్జర్వర్‌గా ఎస్ఎన్ శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న కలెక్టర్



ఆకర్ష్, సంయమ కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

ఓర్వకల్లు, ఆగస్టు 11 : పూర్వ విద్యార్థులతో తన పాత జ్ఞాపకాలను కలెక్టర్ పి.రంజిత్‌బాషా నెమరువేసుకున్నారు. ఆదివారం కాల్వబుగ్గ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం ఆకర్ష్ సంయమ 1992-1998 వ బ్యాచ్ 11వ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆకర్ష్ సభ్యుడుత కలెక్టర్ పి. రంజిత్‌బాషా హాజరయ్యారు. అంతకుముందు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో తాను పదో తరగతి వరకు చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మీరు ఎలా ఉన్నారు, ఎవరెవరు ఎక్కడ స్థిరపడ్డారు, ఏ వృత్తిలో ఉన్నారనే విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. తన బాల్యాన్ని, గురువులతో ఉన్న బంధాన్ని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఆకర్ష్ సంయమ చేసే కార్యక్రమాలు బాగున్నాయని కొనియాడుతూ కలెక్టర్‌గా తాను చదివిన పాఠశాలకు తగిన సేవ చేస్తానన్నారు. ప్రతి ఏటా పది మంది విద్యార్థులకు ఆకర్ష్ స్కాలర్ షిప్స్, ఆరుగురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు, స్పోర్ట్స్ మీట్, చిత్రలేఖనం, శ్రీశ్రీ సాహిత్య పురస్కారాల ప్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఆకర్ష్ సభ్యులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లి దండ్రులు, ఆకర్ష్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గల్లంతు

నదిలో గాలిస్తున్న పోలీసులు, బంధువులు



శేషన్న (ఫైల్)

పగిడ్యాల, ఆగస్టు 11: జీవనోపాధి కోసం కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి పుట్టి పల్టీ కొటిన సంఘటనలో శేషన్న(60) గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన బండారు శేషన్న 20 ఏళ్లకు పైగా చేపలు పడుతూ, నదిలో నీరు తగ్గిన సమయంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం చేపలు పట్టుకునేందుకు నదిలోకి పుట్టిలో బయలుదేరారు. అలల తాకిడికి పుట్టి ప్రమాదవశాత్తు పల్టీ కొంటడంతో శేషన్న నదిలో పడిపోయాడు. నది సమీపంలో ఉన్న కొంత మంది శేషన్న పడిపోవటం గమనించారు. అతడ్ని కాపాడేందుకు ఇంజన్ బోట్లులో బయలుదేరినప్పటికీ అప్పటికే నీటిలో గల్లంతైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని ముచ్చుమర్రి ఎస్ఐ గంగయ్యకు తెలపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బంధువుల సహాయంతో కృష్ణానదిలో గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ గంగయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 11: మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన షేక్ రెహినాబీ (50) అనే మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. శనివారం తన ఇంటి వద్ద ఎరువుల సంచులు కడిగి వాటిని తీగపై ఆరబెడుతూండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త పెద్ద ఖాజామియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

తుగ్గలి, ఆగస్టు 11: వేరుశనగ పంట తొలగిస్తుండగా.. పాము కాటుకు గురై రైతు కోటకొండ వీరాంజనేయులు (48) మృతి చెందాడు. ఆదివారం మండలంలోని లింగనాయనదొడ్డికి చెందిన కోటకొండ వీరాంజనేయులు శనివారం నునుసరాళ్ల గ్రామ పొలాల్లో వేరుశనగ పంట తొలగిస్తుండగా.. పాము కరిచింది. ఆయన్ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పత్తికొండ వైద్యశాలకు తరలించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు దర్యాప్తు చేస్తున్నామని తుగ్గలి ఎస్ఐ జహీర్ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. టీడీపీ నాయకులు తలారి రాముడు, మోహన్, రామారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నందవరం, ఆగస్టు 11: మండల పరిధిలోని నాగలదిన్నె బ్రిడ్జి దగ్గర కర్ణాటక మద్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమ్‌సింహ, ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. బ్రిడ్జి దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక ప్రాంతమైన తలమారి నుంచి 10 బాక్స్‌లను బైక్‌పై తీసుకు వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ ప్రాంతమైన పులికల్ గ్రామానికి చెందిన సుంకన్న, బోయ తాయన్నలపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కమిషనర్ పీవీ రామలింగేశ్వర్



కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 11: తుంగభద్ర నది పరివాహన ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ కోరారు. ఆదివారం నగర పాలక అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నది పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రాత్రికి నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని, ఈ విషయం ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు. తుంగభద్ర డ్యామ్‌లో చైన్‌లింకు తెగి 19వ గేటు శనివారం రాత్రి కొట్టుకుపోయిందన్నారు. ఇప్పటికే లక్షకు పైగా క్యూసెక్కుల నీరు వృథాగా నదిలో ప్రవహిస్తుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గిరిజన భాషలకు రాజ్యాంగ హోదా కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేనావత్ రాము నాయక్

ఓర్వకల్లు, ఆగస్టు 11: గిరిజన భాషలకు రాజ్యాంగ హోదా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరామని ఉమ్మడి జిల్లాల షెడ్యూల్ ట్రైబ్స్ ఫెడరేషన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ రామూ నాయక్ కోరారు. ఆదివారం ఓర్వకల్లులో ఆయన మాట్లాడుతూ గిరిజన భాషలకు గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వాలపై పోరాటం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనుమాన్ నాయక్, భూక్యా లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలను పరిష్కరించాలి

● పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి



రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని చూపుతున్న సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 11: నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ. పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రామలింగేశ్వర్‌నగర్, ఎస్‌బీఐకాలనీ, సీతారామనగర్ నుంచి కొత్తబస్టాండు వరకు స్థానికులతో కలిసి పర్యటించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ అధికారులు రోడ్ల మరమ్మతులు, చెత్త తొలగింపు పేరుతో కోట్లు ఖర్చుపెడుతున్నారన్నారు. కాలనీల్లో రోడ్లపై ఎక్కడి గుంతలు అక్కడే..ఎక్కడి చెత్త అక్కడే ఉండటం దారుణమన్నారు. రాత్రి సమయాల్లో అనేక మంది ద్విచక్ర వాహనదారులు, తెల్లవారుజామున వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానిక కార్పొరేటర్ తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, జే.నరేంద్ర, టి.కృష్ణ, ఎస్.సురేంద్ర పాల్గొన్నారు

ముగిసిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు



విజేత గుంటూరు జట్టుతో అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 11: గార్గేయపురం జడ్పీహెచ్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అధినేత డా. రాయపాటి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. వెంకట్రాముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోప్ స్కిప్పింగ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ క్రీడ స్కూల్ గేమ్స్‌లో ఉందని చెప్పారు. మొదటి స్థానంలో గుంటూరు, రెండో స్థానంలో నంద్యాల, మూడో స్థానంలో అన్నమయ్య జిల్లాలకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బషీర్ బేగ్, సోఫిక్, రాష్ట్ర కార్యదర్శి ఎస్. అబ్దుల్ రెహిమాన్, వివిధ జిల్లాల కార్యదర్శులు తిరుపతిరావు, సాగర్, శరత్ నాయక్, శిరీష, వికాస్, మల్లికార్జునుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

గీతాంజలిలో ల్యాంప్ లైటింగ్ ఉత్సవ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 11: నగరంలోని గాయత్రీ ఎస్టేట్ గీతాంజలి నర్సింగ్ కాలేజీలో 2023-24వ బ్యాచ్ నర్సింగ్ విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో ఆదివారం ల్యాంప్ లైటింగ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి, కళాశాల చైర్మన్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వసంత కుమారి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్లీనికల్ ట్రైనింగ్ పీరియడ్‌లో రోగులతో సన్నిహితంగా ఉంటూ ఆప్యాయతతో సేవలు అందించాలన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

మంత్రాలయం, ఆగస్టు 11: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల ఏర్పాట్లను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పరిశీలించారు. ఆదివారం నదీ తీరం, గురునివాస్, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం రోడ్డు లో ఉన్న గెస్టు హౌస్‌లు, ఎంటీఆర్ లైన్‌లో ఉన్న మధ్వమార్గ్ కారిడార్ పను లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులు ఎటువంటి ఇబ్బంది లు పడకుండా ఉండేందుకు అధికారులంతా సమన్వయంతో పనులు చేప ట్టాలని కోరారు. ముఖ్యంగా తాగు నీరు, వైద్యం, రోడ్ల శుభ్రత, క్యూలైన్లు పరిమళ ప్రసాదం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు కళ్యాణ మండపాలు, డార్మెటరీ రూపంలో క్లాక్ రూమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

పొదుపు ఉద్యమ స్ఫూర్తి ఘనత చంద్రబాబుదే

● టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



హుశేనాపురంలో పొదుపు మహిళలతో మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఆగస్టు 11: పొదుపు ఉద్యమ స్ఫూర్తి ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని హుశేనాపురంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గత వైసీపీ పాలనలో పొదుపు మహిళల స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు 1997లో డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒకప్పుడు మహిళలు ఒంటరిగా వెళ్లేవారు కాదని డ్వాక్రా సంఘాలు ఏర్పాటు కాగానే మహిళలు ఎంతో చైతన్యవంతులు అయ్యారనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన డ్వాక్రా గ్రూపు సభ్యులు దినాదినాభివృద్ధి చెంది ఎంతో అభివృద్ధి చెందారని కొనియాడారు. చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పొదుపు సంఘాలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించేందుకు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఓర్వకల్లు పొదుపు మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారని, అదే స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలని పొదుపు మహిళలను ఆయన కోరారు.

విద్యుత్ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నగేష్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 11: విద్యుత్ శాఖలో ఖాళీ ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగేష్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఇంజనీర్ల కొరత వేధిస్తుందన్నారు. ఏటా ఉద్యోగ విరమణ చేస్తున్న పోస్టుల్లో కొత్త నియామకాలు చేసేందుకు ప్రభుత్వం,విద్యుత్ సంస్థలు ముందుకు రావడం లేదన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఒక్క ఇంజనీరింగ్ పోస్టు కూడా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. మొత్తం మూడు విద్యుత్ సంస్థల్లో 7500 ఉంటే 5000 మంది మాత్రమే పని చేస్తున్నారని, ఇంకా 2500 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తక్షణమే పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు వీరేష్, సురేష్, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

● డ్రగ్స్‌ను నియంత్రించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. పాతబస్టాండు సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ విలయతాండవం చేస్తుందన్నారు. ప్రముఖ ప్రాంతములో కనిపించే డ్రగ్స్ ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టడంతో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. యువకులు డ్రగ్స్ మాయంలో పడకుండా యూత్ సెంటర్లు అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డీవైఎఫ్ఐ నూతన కమిటీకి ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రెహమాన్, బాబువలి, అబ్దుల్లా, పయాజ్ తదితరులు పాల్గొన్నారు.

'హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలి'



వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడుతో వీహెచ్‌పీ, అనుబంధ సంస్థల ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 11: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్టి పూర్తి సందర్భంగా ఆగస్టు 16 నుంచి 31 వరకు అన్ని ప్రాంతాల్లో 'హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో నిర్వహించిన వీహెచ్‌పీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళనాల్లో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షితలను వితరణ చేయడంలో ముఖ్య భూమిక పోషించిన వారిని, అయోధ్య రామాలయానికి నిధిని సమకూర్చిన వారిని ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు.

'అవయవ దానంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి'



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహబూబ్ బాషా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 11: అవయవ దానంపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన పెరగాలని, ఆ దిశగా లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తివంతంగా ఉన్నాయని కర్నూలు ఏపీఎస్పీ 2వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం నగర శివారు గార్గేయపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, గ్రామస్తులతో కలసి అవవయ దానాల గురించి వివరించే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు అవయవ దానంపై అవగాహన పెంచుకొని విస్తృత ప్రచారం చేయాలని, ఒక వ్యక్తి జీవించి ఉన్నప్పుడే అవయవ దాన ధ్రువీకరణ పత్రాన్ని ధ్రువీకరించి సబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.

శాంతియుత నిరసన



శాంతియుత నిరసన తెలుపుతున్న సిద్ధివినాయక అపార్టుమెంటు వాసులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాత్మక దాడులను ఖండిస్తూ నగరంలోని కృష్ణానగర్ సిద్ధి వినాయక అపార్టుమెంటు ప్రాంగణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమ్యూనిటీ ఆఫ్ ఇండియా జిల్లా సెక్రటరీ రమావత్ రాజీవ్ నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ దాడులలో మరణించిన హిందూ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ ఆదివారం సాయంత్రం కొవ్వొత్తులతో శాంతియుత ప్రదర్శన నిర్వహించారు.

ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరు కావాలి

సి. బెళగల్, ఆగస్టు 11: ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. ఆదివారం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు సమస్యలు ఉంటే అర్జీలను సమర్పించాలని కోరారు.

రేపు మండల మీట్

సి. బెళగల్, ఆగస్టు 11: రేపు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో ఏసీ రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని మండలస్థాయి అధికారులు తమ నివేదికలను తీసుకుని మండల మీట్‌కు రావాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు పార్లమెంట్ సభ్యులు నాగరాజు హాజరవుతున్నట్లు తెలిపారు.

క్లాప్ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11: క్లాప్ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం వారు క్లాప్ వాహనాలను పరిశీలించారు. వీటిని వినియోగించకపోవడం వల్ల తుప్పు పడుతున్నాయని అన్నారు. 11మంది క్లాప్ డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు.

పని సర్దుబాటు నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 11: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయు భవన్‌లో శేఖర్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి విద్యా ప్రవేశాలు గణనీయంగా పెరగడం వలన, గత మూడు నెలల నుంచి ఉపాధ్యాయులు పదవీ విరమణ చేస్తుండటం వలన పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, దీనితో ప్రభుత్వం పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టబోతుందని తెలిపారు. ఈ పని సర్దుబాటు ప్రక్రియను జీవో.117 ప్రకారం కాకుండా జీవో.53కు అనుగుణంగా జరగాలని అన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, ఊపిరితిత్తుల డయాలసిస్, మానసిక వికలాంగులు కలిగిన తల్లిదండ్రులు ఉన్నవారికి, 75 శాతం అంగవైకల్యం, దృష్టిలోపం ఉన్న ఉపాధ్యాయులకు ఈ పని సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు



విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి

కర్నూలు (ఎడ్యుకేషన్), ఆగస్టు 11: మహిళలు పురుషులతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి తెలిపారు. ఆదివారం స్థానిక బీ. క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహంలో డిగ్రీ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి టాపర్‌ను ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి, హాస్టల్ వార్డెన్ బెన్నమ్మ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళ విద్య ఎంతో అవసరమని అన్నారు.

వీకర్ సెక్షన్ కాలనీలో కార్డన్ సెర్చ్

కర్నూలు, ఆగస్టు 11: ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం డీఎస్పీ జే.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ నాగరాజరావు, నాల్గవ పట్టణ ఎస్ఐలు మోహన్ కిషోర్, చంద్రశేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, సెబ్ పోలీసులు సంయుక్తంగా ఎన్టీఆర్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన రౌడీషీటర్ షేక్ చాంద్‌బాషా అలియాస్ దుద్దును అదుపులోకి తీసుకుని విచారించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన నగర బలిజ సంఘం నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 11: నగర బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం అబ్బాస్‌నగర్‌లోని స్థానిక ప్రైవేటు పాఠశాలల్లో రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు ఆర్జా రామకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు నగర బలిజ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా టి. గోపీనాథ్, మండ్లం రవి, కోశాధికారిగా శైలేష్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



నన్నూరులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, ఆగస్టు 11: కేరళ వయోనాడ్ వరద బాధితుల సహాయార్థం మండలంలోని నన్నూరు గ్రామంలో ఆదివారం సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్, మల్లేష్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వయోనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి, వరదల్లో వందలాది మంది చనిపోయారని, అనేక మంది క్షతగాత్రులయ్యారన్నారు. వారిని ఆదుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాసూం బాషా, బొజ్జన్న, సలాంభాషా, ఆకుల మధు, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, వలి, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 11: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ ఆదివారం తెలిపారు. నగర పాలకకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే అర్జీ, ఆధార్,మొబైల్ నెంబర్లతో వచ్చి ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

నాటు సారా స్థావరాలపై పోలీసుల దాడులు



నాటు సారా స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు, గూడూరు పోలీసులు

ఓర్వకల్లు, ఆగస్టు 11: కర్నూలు సెబ్ పోలీసులు మండలంలోని గుడుంబాయి తండా పరిసర ప్రాంతాల్లో ఆదివారందాడులు చేశారు. ఈ దాడుల్లో 1800 లీటర్ల నాటుసారాకు తయారు చేసిన బెల్లం ఊటను, 30 లీటర్ల నాటుసారాను గుర్తించి ధ్వంసం చేశారు. దాడుల్లో కర్నూలు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్, డీపీఎఫ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐ మారుతి ప్రసాద్ ఉన్నారు.

గూడూరు: గూడూరులోని నీలి శికారి కాలనీలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హనుమంతయ్య తెలిపారు. కోడుమూరు సెబ్ పోలీసులు, గూడూరు పోలీసులు ఆదివారం గూడూరు పట్టణంలోని నీలి శికారి కాలనీలో 200 లీటర్ల నాటుసారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊట ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారా సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ హనుమంతయ్య, కోడుమూరు సెబ్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ అలీబేగ్, ఏఎస్ఐ అంజనేయులు పాల్గొన్నారు.

రామోజీరావు కృషి స్మరణీయం



రామోజీరావు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న మీసాల సుమలత తదితరులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 11: పత్రికా రంగం ద్వారా సమాజ శ్రేయస్సుకు రామోజీరావు చేసిన కృషి స్మరణీయమని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కొనియాడారు. ఆదివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఈనాడు దినపత్రిక 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత దివంగత రామోజీరావు చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు రాముడు, నాగన్న, ఖాదర్‌బాయ్, ఆంజనేయులు, బీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పల్లేటి లక్ష్మీ కులశేఖర్ సేవలు మరువలేనివి



పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు నివాళులు అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 11: పౌరాణిక పద్య నాటక రంగానికి దివంగత సినీ, టీవీ, నాటక రంగ రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్ చేసిన సేవలు చిరస్మరణీయమని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల మృతి చెందిన ప్రముఖ రచయిత లక్ష్మీ కులశేఖర్ సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత కళాకారులు ఆయన చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జి. పుల్లయ్య మాట్లాడుతూ రచయితగా పల్లేటి లక్ష్మీ కులశేఖర్ నాటక రంగంపై మమకారంతో లక్షలు ఆర్జించే సినీ, టీవీ రంగాలను వదులుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రంగస్థల కళాకారులు వీవీ రమణారెడ్డి, హెచ్ చంద్రన్న, ఎండీ క్రిష్టఫర్, గాండ్ల లక్ష్మన్న, రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, మహ్మద్ మియా, ఇనాయతుల్లా తదితరులు ప్రసంగించారు.

● అలరించిన భక్త అన్నమయ్య నాటకం

వారం వారం కళాప్రదర్శనల్లో భాగంగా ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'భక్త అన్నమయ్య' పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను ఆసాంతం అలరింపజేసింది. నెల్లూరు జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మీనరసింహ నాట్య కళామండలి సభ్యులు, జానకిరామ్ దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటక దర్శకుడు జానకిరామ్‌ను రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య శాలువతో సత్కరించగా, టీజీవీ కళాక్షేత్రం పక్షాన రూ.60వేలు పారితోషికం కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అందజేశారు.

చినుకు పడితే..చిత్తడే..



కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 11: నగర శివారులోని రిచ్‌మండ్ కాలనీ ప్రాంతంలో చినుకు పడిందంటే చిత్తడిగా రహదారులు దర్శనమిస్తున్నాయి. పలు పర్యాయాలు నగర పాలక సంస్థ కార్యాలయంలో రోడ్లు వేయాలని ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథులే కరువయ్యారని కాలనీవాసులు వాపోతున్నారు. కోడుమూరు రోడ్డులోని రిలియన్స్ మార్ట్ వెనకాల పాత ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద ఈ కాలనీ ఏర్పాటై సుమారు ఐదు సంవత్సరాలు కావస్తోంది. ఇప్పటి వరకు ప్రధాన రహదారి నుంచి కాలనీకి రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాకుండా రోడ్డుకు అడ్డంగా వివిధ ట్రాన్స్‌పోర్టులకు చెందిన లారీలు నిలబడి ఉండటంతో అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు రాత్రి సమయాల్లో ఆ దారి వెంట విద్యుద్దీపాలు లేకపోవడంతో వాహనదారులు కింది పడి దెబ్బలు తగిలిన సంఘటనలు మరెన్నో ఉన్నాయి. వీటితోపాటు పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం రహదారిలో కిందిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

తాగు, సాగు నీరు అందేలా చూడాలి



నారా లోకేశ్‌ను కలిసిన గుడిసె కృష్ణమ్మ

ఆదోని, ఆగస్టు 11: ఆదోని నియోజకవర్గం ప్రజలకు తాగు, సాగు నీరు అందేలా చొరవ చూపాలని ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ కోరారు. ఆదివారం హైదరాబాదులో ఉన్న మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం పాఠశాలల సంఖ్య పెంచాలని, తల్లిదండ్రులతోపాటు వలసలు పోతున్న విద్యార్థుల కోసం హాస్టళ్ల సంఖ్య పెంచాలని కోరారు. ఆదోని డివిజన్‌లో వలసల నివారణ కోసం ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించాలని విన్నవించారు. లోకేశ్‌ను కలిసిన వారిలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె రాములు ఉన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన కపట్రాళ్ల బుజ్జమ్మ



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కపట్రాళ్ళ బుజ్జమ్మ

ఆలూరు, అగస్టు 11: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కపట్రాళ్ల బుజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. కపట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుటుంబానికి టీడీపీ ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ భరోసా ఇచ్చినట్లు వారు ఆదివారం తెలిపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీలో సేవలు అందిస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గుంతలు పూడ్చిన కార్మిక నాయకులు



కైరుప్పలలో గుంతలు పూడుస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆస్పరి, అగస్టు 11: మండలంలోని కైరుప్పల గ్రామంలోని రోడ్లపై పడిన గుంతలను ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కైరుప్పల గ్రామంలో రోడ్డు గుంతల మయంగా మారాయని, అక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఆ రోడ్లపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గ్రామ కార్యదర్శి శ్రీను, రంగన్న, బద్రి, జానకి, రాముడు, సురేష్ పాల్గొన్నారు.

ఆదోని డీఎస్పీగా సోమన్న



ఆదోని, అగస్టు 11: ఆదోని డీఎస్పీగా సోమన్న బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆదోని తాలూ కా పోలీస్ స్టేషన్ సీఐగా పని చేశారు. ప్రస్తుతం గుంటూరు సీఐడీ డిపార్ట్‌మెంట్‌లో సీఐగా పని చేస్తూ పదోన్నతిపై ఆదోని డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట గంజాయి మొదలైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలన్న సేవలు మరువలేనివి

తుగ్గలి, అగస్టు 11: చిన్న బాలన్న సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, టీడీపీ జిల్లా కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాంపల్లిలో చిన్న బాలన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న బాలన్న పేదల పక్షపాతిగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాగరాజు, కాశీ వీరయ్య, టైలర్ లాలన్న, ఉమాపతి, పీరా, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల, ఆగస్టు 11: గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి ఉపాధ్యాయులను కలుసుకొని వారిని గౌరవించారు. అలనాటి ఉపాధ్యాయులు వెంకట రమణ, అన్వర్, రాఘవరెడ్డి, జ్యోతి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్రిష్టయ్య, మహబుబ్‌బాషా, విజయకుమారి, బేగం, అన్వర్, ఉసేన్‌పీరా, నారాయణ, అబ్దుల్‌ఖాదర్ హాజరయ్యారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, భరత్ కుమార్, రంగస్వామి నాయుడు, ఫరూక్‌బాషా, బీ వరలక్ష్మి, గాయిత్రి, షమామున్ని పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడకండి

ఆలూరు, అగస్టు 11: నేరాలకు పాల్పడవద్దని ఆలూరు ఎస్ఐ సీవీ నరసింహులు హెచ్చరించారు. ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం పెద్దహోతూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సురక్షిత నీరు అందించాలి

తుగ్గలి, ఆగస్టు 11: రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంటును పునరుద్ధరించి సురక్షిత తాగు నీరును అందించాలని టీడీపీ సీనియర్ నాయకుడు అప్పా వేణుగోపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, ఎస్టీ సెల్ నాయకుడు రామూ నాయక్, ఎస్ఎంసీ ఛైర్మన్ కంబగిరి కోరారు. ఆదివారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఉప్పర్లపల్లి టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిసి గ్రామ సమస్యలను తెలపడంతోపాటు పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో అప్పా ప్రసాద్, మనోహర్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



మేళిగనూరు దగ్గర నీటి ఉధృతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



ఫోన్‌లో టీబీ డ్యామ్ అధికారులతో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

ఆదోని, అగస్టు 11: నదీ తీర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. ఆదివారం డివిజన్‌లోని కౌతాలం మండలం మేలగనూరు, కుంబలనూర్, నది తీర ప్రాంతాలను పరిశీలించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వరద నీటి ప్రవాహంకు హోస్పేట్‌లోని తుంగభద్ర ప్రాజెక్ట్ 19 గేట్ కొట్టుకుపోవడం ద్వారా 90 వేల క్యూసెక్కుల నీటి నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం ద్వారా ఆదోని డివిజన్‌లో తీర ప్రాంతంలో ఉన్న కౌతళం, కోసిగి, నందవరం మండలాల్లో నదీ తీర ప్రాంతాలకు భారీగా నీరు వస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని అన్నారు. ముందస్తుగా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. తీర ప్రాంతంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇరిగేషన్, గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే ఆదోని డివిజన్‌లో రెండు టీం రాష్ట్ర విపత్తు రెస్క్యూ టీమ్స్ సిద్ధంగా ఉండగా వారికి పలు సూచనలు సూచించారు. కార్యక్రమంలో కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామి పాల్గొన్నారు.

కౌతాళం: మేళిగనూరు వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో నీటి ప్రవాహాన్ని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పరిశీలించారు. మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు. మరళి, గుడికంబాలి, వల్లూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ రాజశేఖర గౌడ్ పాల్గొన్నారు.

ఆలూరు: హోస్పేట్ డ్యాం నుంచి దాదాపు 50 వేల క్యూసెక్కుల మేర నీరు వదిలారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన టీబీ డ్యాం అధికారులతో ఫోన్ ద్వారా సమీక్షించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు సాగు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లను ఒడ్డుకు చేర్చుకోవాలని అన్నదాతలకు సూచించారు.

నందవరం: తుంగభద్ర నదీ తీర గ్రామాలైన నదికైరవాడి, గంగవరం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, సజీవపురం, నాగలదిన్నె, గురుజాల, రాయచోటి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. నదిలోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



ఉరుకుందకు వాహనాల్లో వెళ్తున్న భక్తులు

కోసిగి, అగస్టు 11: శ్రావణమాసంలో ఉరుకుంద ఈరన్న స్వామిని శ్రావణ మాస రెండో సోమవారం భక్తులు దర్శనానికి ఆదివారం కోసిగి మీదుగా భక్తులు భారీగా వాహనాల్లో తరలి వెళ్తున్నారు. మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా వాహనాలు ఉరుకుంద వైపు కిక్కిరిసి వెళ్తున్నాయి. కోసిగిలో మార్కండేయ స్వామి దేవాలయం నుంచి ఉరుకుంద ఆర్చ్ వరకు వాహనాలు ట్రాఫిక్ జామ్ అయ్యాయి. రైల్వేగేటు సమస్యతో ట్రాఫిక్ వల్ల భక్తులు ఇబ్బందులు పడ్డారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

మంత్రాలయం, ఆగస్టు 11: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల ఏర్పాట్లను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పరిశీలించారు. ఆదివారం నదీ తీరం, గురునివాస్, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం రోడ్డులో ఉన్న గెస్టు హౌస్‌లు, ఎంటీఆర్ లైన్‌లో ఉన్న మధ్వమార్గ్ కారిడార్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులంతా సమన్వయంతో పనులు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా తాగు నీరు, వైద్యం, రోడ్లు శుభ్రత, క్యూలైన్లు పరిమళ ప్రసాదం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు కళ్యాణ మండపాలు, డార్మెటరీ రూపంలో క్లాక్ రూమ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజల దాహార్తి తీరుస్తాం

పెద్దకడబూరు, ఆగస్టు 11: గ్రామాల్లో ప్రజలు దాహార్తిని తీరుస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో జలజీవన్ మిషన్ కింద వేసిన బోర్లను జియో ట్యాగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద వేసిన బోర్లకు జియో ట్యాగ్ చేశామన్నారు. మండలంలోని జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన బోర్లు, పైపులైన్లు ఏర్పాటు చేసిన వాటికి జియో ట్యాగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది మల్లికార్జున, పోలయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సమయ వేళలు మార్పు

కోసిగి, ఆగస్టు 11: గూడూరు నుంచి ఎమ్మిగనూరు వచ్చే 132 కేవీలైన్ కండక్టర్ మారుస్తున్న కారణంగా రైతులకు అందించే విద్యుత్ సమయ వేళల్లో మార్పులు చేసినట్లు కోసిగి విద్యుత్ ఏఈ వీరేష్ తెలిపారు. ఈ నెల 12 నుంచి మండలంలోని రైతులకు అందిస్తున్న త్రీఫేస్ విద్యుత్ ఉదయం 5 గంటలు, రాత్రి 4 గంటల ప్రకారం 20 రోజులు ఇస్తామని అన్నారు. ఆ తర్వాత యథావిధిగా నిరంతరం 9 గంటల త్రీఫేస్ విద్యుత్ రైతులకు అందిస్తామని చెప్పారు. రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

నందవరం, ఆగస్టు 11: మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు శిక్షణ తరగతులు ఉంటాయని సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి తెలిపారు. అదివారం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలపై శిక్షణ ఉంటుందన్నారు. పారిశుధ్య పనులు, తాగునీటి సమస్య, పరిసరాల పరిశుభ్రత గురించి ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య, రామారావులు వివరిస్తారన్నారు.

టమోటా మార్కెట్ ప్రారంభం



టమోటాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర

పత్తికొండ, ఆగస్టు, 11: పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా మార్కెట్‌ను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించారు. ఆదివారం ఉదయం మార్కెట్‌లో పూజా కార్యక్రమం నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధరను అందించేవిధంగా వ్యాపారులు టమోటాలను కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సెక్రటరీ కార్నలిస్, తుగ్గలి నాగేంద్ర, ప్రమోద్ కుమార్‌రెడ్డి, వెంకటపతి, వాకిటి శ్రీను, పులికొండ చంద్ర, రమేష్, ప్రకాష్, శ్రీకాంత్ చౌదరి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి శంకుస్థాపన

వెల్దుర్తి, ఆగస్టు 11: మండలంలో గుంటుపల్లెలోని సీతారామాంజనేయ స్వామి వృద్ధాశ్రమానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామ నాయకుడు ఈదుల వెంకటరాముడు ఆధ్వర్యంలో వాసంతి, మధు, పవన్ చౌదరిలు రూ.50 లక్షలతో వృద్ధాశ్రమాన్ని నిర్మిస్తున్నారు. గుంటుపల్లె స్వగ్రామమైన కమ్మదామ నారాయణ, లలితమ్మలు వృద్ధాశ్రమానికి 40 సెంట్లు స్థలాన్ని దానం చేశారు. ఈ స్థలంలో వృద్ధాశ్రమంతోపాటు రామాలయం గుడి నిర్మాణం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పుల్లగుమ్మి టీడీపీ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి గృహ ప్రవేశానికి కేఈ శ్యాంబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బొమ్మన శివశంకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బలరాంగౌడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడు, జయరాముడు, రామకృష్ణ ఆచారి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

ఆదోని టౌన్, అగస్టు 11: హోస్పేట్ డ్యామ్ గేట్ కిందికి పడిపోయిన సమాచారం తెలిసిన వెంటనే మునిసిపల్ ఛైరపర్సన్ వాల్మీకి శాంత అధికారులను అప్రమత్తం చేశారు. వచ్చే వేసవి కాలంలో పట్టణంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం బసాపురం చెరువులో జరుగుతున్న నీటి పంపింగ్ పనులను ఆమె పరిశీలించారు. ఎల్ఎల్‌సీలోకి ప్రస్తుతం వదిలిన నీటితో బసాపురం చెరువు, రాంజల చెరువులను నింపుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఆస్పరి, అగస్టు 11: తాగునీటి సమస్యను తీర్చాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ పట్టణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగనాతన హళ్లి నుంచే వచ్చే తాగునీరు సక్రమంగా ఆస్పరికి రాకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. 10, 15 రోజులకోసారి నీళ్లు వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉరుకుందప్ప, బ్రహ్మయ్య, కృష్ణమూర్తి, రంగన్న, సంజయ్, హనుమంతు, చంద్ర, గోపాలు, ఈశ్వర్ పాల్గొన్నారు.

బాలిక వివాహంపై ఫిర్యాదు

పత్తికొండ, ఆగస్టు, 11: పత్తికొండ మండల పరిధిలోని ఓ గ్రామంలో బాల్య వివాహం జరిగిందని బాలిక గ్రామానికి చెందిన కొందరు ఫిర్యాదు చేశారు. పత్తికొండ సీఐ జయన్నకు ఫిర్యాదు అందించిన వ్యక్తులు వివాహానికి సంబంధించిన ఆధారాలు అందించినట్లు సమాచారం. కాగా గతంలోనే బాల్య వివాహం ఆరోపణపై సదరు బాలికను ఐసీడీఎస్ అధికారులు కర్నూలు బాలిక సంరక్షణ హోంకు తరలించినట్లు తెలిసింది. ఐసీడీఎస్ అధికారులతో విచారణ చేసి ఆ తరువాత కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

స్నేహితుల ఔదార్యం

వెల్దుర్తి, ఆగస్టు, 11: పట్టణంలో స్థానిక వడ్డె గేరిలో నివాసం ఉంటున్న వడ్డె ప్రసాద్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో తమతోపాటు చదువుకున్న వడ్డె ప్రసాద్ కుటుంబానికి 1994-95 పదో తరగతి చదివిన స్నేహితులంతా కలిసి రూ.41 వేలు అందజేశారు.

రైతులకు కౌలు కార్డులు అందజేశాం

మద్దికెర, ఆగస్టు 11: మండలంలో 350 మంది రైతులకు కౌలు కార్డులు అందజేశామని వ్యవసాయ శాఖ మండల అధికారి ఉప్పర రవి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 350 మందిని గుర్తించి కార్డులు ఇచ్చామని అన్నారు. కౌలు కార్డులు పొందిన రైతులకు ప్రభుత్వం నుంచి పంట సహాయాలు అందుతాయని తెలిపారు.

లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, ఆగస్టు 11: టీడీపీ గెలుపు కోసం పని చేసిన లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేయాలని లింగాయత్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 18 లక్షల మంది లింగాయత్‌లు ఉన్నారని, వారందరూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో మూకుమ్మడిగా టీడీపీకి ఓటు వేసి టీడీపీ అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. లింగాయత్‌లను ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగే లా కృషి చేయాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మద్దికెర, ఆగస్టు 11: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రమేష్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా ప్రాంతాల్లో మాధక ద్రవ్యాలతో ఆరోగ్యం క్షీణిస్తుందని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

గుండె జబ్బును ప్రాథమిక దశలోనే గుర్తించాలి

గోనెగండ్ల, ఆగస్టు 11: గుండె జబ్బును ప్రాథమిక దశలోనే గుర్తించాలని గుండె వైద్య నిపుణుడు రామపకీరా అన్నారు. ఆదివారం గోనెగండ్లలో ఎస్ఎస్ఎం దంత వైద్యశాల ఆధ్వర్యంలో శ్రీచక్ర హాస్పిటల్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు కంటి వైద్య పరీక్షలు, గుండెకు సంబంధించిన టూడీఈకో, ఈసీజీ, రక్తపరీక్షలు, దంత పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ఎస్ఐగా నిరంజన్ రెడ్డి

పెద్దకడబూరు ఆగస్టు11: పెద్దకడబూరు ఎస్ఐగా నిరంజన్ రెడ్డి ఆదివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ మహేష్ కూమార్ పెద్దతుంబళం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ పాలనలో మార్పు

మద్దికెర, ఆగస్టు 11: ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన రెండు నెలలోపే పాలనలో మార్పు కనిపిస్తోందని తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, జిల్లా టీడీపీ నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, బురుజుల ప్రకాష్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనకు, మాజీ సీఎం జగన్ పాలనకు ఎంతో తేడా ఉందని అన్నారు. ఉచిత ఇసుక, పింఛన్ల పెంపు తదితర కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నా రని అన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

మద్దికెర, ఆగస్టు 11: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ స్వర్ణలత, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

పొలాలకు ఎలా వెళ్లాలి..?



వర్షం నీటిలో నిరసన తెలుపుతున్న రైతులు

మద్దికెర, ఆగస్టు 11: మద్దికెర శివారులో గల మల్లప్ప గేటు వద్ద రైల్వే బ్రిడ్జి కింద వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల పొలాలకు ఎలా వెళ్లాలని రైతులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు జమేదార్ రాజు, ఈశ్వరయ్య, వెంకట్రాముడు, లింగన్నలు మాట్లాడుతూ రైల్వే బ్రిడ్జి కింద నుంచి వెళ్లి 12 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఈ బ్రిడ్జి కింద నుంచి వెళ్లేటప్పుడు ప్రమాదం జరిగి వృషభాలు మరణించాయని తెలిపారు. రైల్వే అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి దారి చూపాలని కోరారు.

మోదీ ఆశయాలు నచ్చి బీజేపీలో చేరుతున్నాం



బీజేపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఆదోని టౌన్, ఆగస్టు 11: మోదీ ఆశయాలు నచ్చడంతో వైసీపీ నుంచి బీజేపీలో చేరుతున్నామని స్థానిక వాల్మీకి నగర్‌కు చెందిన బోయ నాగిరెడ్డి, బోయ అనిల్, బోయ రఘు అన్నారు. వైసీపీకి చెందిన 120 మంది కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే డా. పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరారు. పట్టణ అభివృద్ధి కోసం పార్థసారథి పట్టుదలతో పని చేస్తారన్న నమ్మకం తమకు ఉందని వాల్మీకి నగర్ వాసులు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నిలకంఠ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, ఆదోని అసెంబ్లీ కోకన్వీనర్ నాగరాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సాయి కుమార్ పాల్గొన్నారు.

పదోన్నతులు చేపట్టాకే సర్దుబాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుంకన్న

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 11: ఉపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాకే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసీ సుంకన్న అన్నారు. ఆదివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 117 ప్రకారం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి జీవో 53 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఎస్జీటీలుగా చూపించడం దారుణమని న్నారు. ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు, అంజనేయ, వెంకటేశులు, భాస్కర్ పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11: క్లాప్ డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం వారు క్లాప్ వాహనాలను పరిశీలించారు. వీటిని వినియోగించకపోవడం వల్ల తుప్పు పడుతున్నాయని అన్నారు. 11మంది క్లాప్ డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. స్పందించి క్లాప్ డ్రైవర్లను ఆదుకోవాలని కోరారు.

హాస్టళ్ల సంఖ్య పెంచాలి

మంత్రాలయం, ఆగస్టు 11: మంత్రాలయం నియోజకవర్గంలో హాస్టళ్ల సంఖ్య పెంచాలని విద్యానగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీకాంత్ రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఆదివారం హైదరాబాదు నారా లోకేశ్ నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. నిత్యం తల్లిదండ్రులు వలసలు పోవడం వల్ల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ఇందుకోసం పాఠశాలలు, హాస్టళ్ల సంఖ్య పెంచాలని కోరినట్టు తెలిపారు.

వయనాడ్ బాధితులకు ఆర్థిక సాయం



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం ప్రజా సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11: వయనాడ్ వరద బాధితులకు ఆదివారం విరాళాలు సేకరించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి వయనాడ్ ప్రజలను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటియూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, లక్ష్మీ నరసయ్య, డీవైఎఫ్ఐ కార్యదర్శి రంగప్ప పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి శూన్యం

గోనెగండ్ల, ఆగస్టు 11: గత వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగలేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, రంగన్న అన్నారు. ఆదివారం పెద్దమరివీడు గ్రామంలో సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంపన్నగౌడ్, రంగన్న, మండల కార్యదర్శి నాగప్ప మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో తాగు, సాగు నీరు లేక ప్రజలు, రైతులు ఇబ్బంది పడ్డారని అన్నారు. అలాగే గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు లేక ప్రజలు బాధలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ సమస్యలు తీరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలిక్, శ్రీరాములు, నరసన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంపన్నగౌడ్